క్లుప్తంగా

10 నుంచి ఉచిత కంటిశుక్లం చికిత్సా శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామంలో ఈ నెల 10 నుంచి 16 వరకూ వారం రోజుల పాటు బులుసు కనకదుర్గ, వెంకట సత్య సుబ్రహ్మణ్యశర్మ జ్ఞాపకార్థం ఉచిత కంటి శుక్లం చికిత్స శిబిరం నిర్వహించనున్నట్టు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. లంకా విజయ, మెహర్ చంద్, బులుసు, భమ్మిడిపాటి కుటుంబ సభ్యుల నిర్వహణలో కొనసాగే శిబిరంలో చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల నిపుణులు చికిత్స అందిస్తారన్నారు. గ్రామ శివారు చినకోరుమిల్లిలోని సీతారామ కాపు కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ శిబిరంలో సేవలందిస్తారన్నారు. శిబిరంలో సేవలు పొందగోరువారు 8997384164, 7095175251, 8008106566 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

రామచంద్రపురం ఎస్సైగా వాసు



ఎస్సై వాసు

రామచంద్రపురం: పట్టణ ఎస్సైగా పి.వాసు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు రూరల్ ఎస్సైగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఈయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు తదితర ప్రాంతాల్లో ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రమాదకరంగా రహదారి



దంగేరు-శివల మార్గంలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రమాదకరంగా ఉన్న రహదారి

కె.గంగవరం: మండలంలోని దంగేరు నుంచి శివల వెళ్లే రహదారిలో వంతెన వద్ద రహదారికి అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలకు వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం గ్రావెల్ అయినా ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే అప్రోచ్ నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

మంత్రి సుభాష్‌కు సత్కారం



మంత్రి సుభాష్‌ను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న యూనియన్ సభ్యులు

రామచంద్రపురం: పట్టణంలోని లారీ యూనియన్ కార్యాలయంలో లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గన్నమని చక్రవర్తి లారీ ఓనర్స్, వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇరువురు మున్సిపల్ అధికారుల బదిలీ

మండపేట: స్థానిక మున్సిపాలిటీలోని ఇరువురు అధికారులకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా మున్సిపల్ మేనేజర్ కనకరాజును సామర్లకోట మున్సిపాలిటీకి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.లావణ్యను గుడివాడ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. రెండున్నరేళ్లుగా కనకరాజు మేనేజ్‌మెంట్ సెక్షన్లో సమర్థవంతంగా సేవలు అందించారు. అలాగే రెండేళ్ల క్రితం ఇక్కడకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వచ్చిన లావణ్య పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేశారు. కాగా మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఇప్పటికే బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో టీ వీ రంగారావు బాధ్యతలు చేపడతారని తెలిసింది.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ దొరరాజు

మండపేట: రూరల్ సీఐగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన పీతల దొరరాజు సర్కిల్ పరిధిలోని పాత నేరస్తులు, రౌడీషీటర్లపై దృష్టి పెట్టారు. వారందరినీ ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు తమ పద్ధతులు మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆవేశంలో కొన్ని పొరపాట్లు చేసినప్పటికీ వాటిని సరిదిద్దుకుని వివేకంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ సురేష్‌బాబు కూడా పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సన్నద్ధం

- గణపతి నవరాత్రులకు ఆలయ కమిటీల ఏర్పాట్లు
- అపురూపంగా సిద్ధమవుతున్న గణనాథులు
- గ్రామాల్లో రాట ముహూర్తాలు



రామచంద్రపురంలో అమ్మకాలకు సిద్ధం చేసిన గణనాథుని విగ్రహాలు

రామచంద్రపురం: గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందడి ప్రారంభమైంది. వినాయక చవితి వచ్చిందంటే చాలు యువకులకు ఎనలేని ఉత్సాహం వస్తుంది. వినాయక చవితికి సమయం దగ్గర పడటంతో గ్రామాల్లో మండపాల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఇప్పటికే వినాయక విగ్రహాల కోసం ఆర్డర్లు ఇస్తున్నారు.

రాజస్థాన్ నుంచి వచ్చి..

రాజస్థాన్ నుంచి వచ్చిన కళాకారులు నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామాలలో మకాం వేసి విగ్రహాలను తయారు చేస్తున్నారు. సాధారణంగా ఉపాధి దొరకని వారు తమకు ఉపాధి మార్గం చూపమని దేవుడ్ని వేడుకుంటారు. వారు మాత్రం దేవుడిని తయారు చేయడమే ఉపాధికి మార్గంగా ఎంచుకున్నారు. వేల కిలోమీటర్ల నుంచి పొట్ట చేతపట్టుకుని వచ్చి తమ చేతిలో ఉన్న విద్యతో దేవునికి రూపమిచ్చి ఉపాధి పొందుతున్నారు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు ఇక్కడకు వచ్చి ఏడాది పొడవునా ఇక్కడే నివాసాలు ఏర్పరుచుకుని ఉంటున్నారు.

పలు రూపాల్లో..

భగవంతుడు జీవరాశులకు ప్రాణం పోస్తుంటే..అదే దేవుని రూపాలకు వీరు ప్రాణం పోస్తున్నారు. రామచంద్రపురం, ద్రాక్షారామలో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు రూ.1000 నుంచి మొదలుకొని రూ. 25 వేల వరకూ అందుబాటులో ఉన్నాయి. గణనాథులను గోపికృష్ణ, పార్వతీ పరమేశ్వరుల చెంత, ఎలుక వాహనంపై, నెమలి, సింహం, ఏనుగు, గోవు, సర్పం, త్రిశూలం ఇలా పలు చూడచక్కని రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఆ విగ్రహాలకు రంగులు వేసి అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు.

ఉత్సవ కమిటీలు సన్నద్ధం

గణేశ్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పల్లెలు, పట్టణాల్లోని ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఉత్సవ కమిటీలు గణనాథుని విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చేందుకు, ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చందాలు వసూలు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలో అత్యంత వైభవంగా నిర్వహించే ప్రాంతాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఇప్పటికే రాట ముహూర్తాలు చేశారు. రామచంద్రపురం పట్టణంలోని డఫేదార్ సెంటర్‌లో సుమారుగా 65 ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహాన్నే పెడుతున్నారు. ఇక్కడ నాలుగు రోజులు క్రితం చవితి ఉత్సవాలకు రాట ముహూరం చేశారు. పందిర్లు, మండపాలు ఏర్పాటు చేస్తూ ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న విగ్రహాల సంస్కృతి

ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన విగ్రహాల సంస్కృతి ఇప్పుడు పల్లెలకు విస్తరించింది. దీంతో పరోక్షంగా విగ్రహాల తయారు చేసే వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఏటా విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గ్రామాల్లో వీధికో ఉత్సవ కమిటీ ఏర్పడుతోంది.

పనులు మానుకుని..



ఏటా వినాయక చవితి ఉత్సవాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. చవితి నాడు మొదలు యువత అన్ని పనులు మానుకుని ఎంతో ఉత్సాహంగా తొమ్మిది రోజులు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇందుకోసం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసుకున్నాం. ఇప్పటినుంచి పలు సన్నాహాక కార్యక్రమాలను చేసుకుంటూ ముందుకు వెళుతున్నాం.

–మేడిశెట్టి శ్రీనివాస్, గణపతి మందం కమిటీ సభ్యుడు, తాళ్లపొలం, రామచంద్రపురం మండలం

ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం

గణపతి నవరాత్ర ఉత్సవాలను ఏటా వైభవంగా నిర్వహించడం మాకు ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. తొమ్మిది రోజులు పాటు గణపతికి ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యాం.

–పిట్టా వెంకటనారాయణరావు (చినబాబు), ఉత్సవ కమిటీ సభ్యుడు, దఫేదారు గణపతి మండపం, రామచంద్రపురం

వైద్య శిబిరాలకు విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కె.గంగవరం: మండలంలోని యండగండి, కూళ్ల గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. యండగండిలో కమ్మ కమ్యూనిటీ హాలు వద్ద, కూళ్ల గ్రామంలోని ఉన్నత పాఠశాల వద్ద హాసిని హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు కేజే ప్రశాంత్, టి.సందీప్, రాకేష్, కె.షెకినా తదితరులు రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. యండగండిలో 100 మందికి, కూళ్ల గ్రామంలో 150 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహికులు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా గతంలోనూ వైద్య సేవలు అందించామన్నారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

పొంగి పొర్లుతున్న గనిపోతురాజు చెరువు



కేశవరంలో పొంగి పొర్లుతున్న గని పోతురాజు చెరువు

మండపేట: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కేశవరం గ్రామంలోని గని పోతురాజు స్వామి పెద్ద చెరువు నిండు కుండను తలపిస్తోంది. ఎగువ ప్రాంతాలైన రాజానగరం మండలంలోని కొండ గుంటూరు, రాజోలు, పాత తుంగపాడు, కొత్త తుంగపాడు, రాధేయపాలెం, ఎర్ర చెరువు, సంపత్ నగరం తదితర ప్రాంతాల వరద నీరంతా వచ్చి చేరడంతో పోతురాజు చెరువు పొంగి ప్రవహిస్తోంది. దీంతో కేశవరం, రాజమహేంద్రవరం రహదారి మధ్యలో ఉన్న గండి నుంచి చెరువు నీరు ఉరకలేస్తూ దిగువ ప్రాంతానికి వెళ్తోంది. తమ ప్రయాణ మార్గంలో గండి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, లారీలు, మినీ వాహనాల కాసేపు అక్కడే ఆగి తమ వాహనాలకు సర్వీసింగ్ చేసుకుంటున్నారు. మరో పక్క ఈ చెరువులో లభిస్తున్న చేపలు స్థానిక జాలర్ల జేబులు నింపుతున్నాయి. కాగా ఒక్కోసారి ఈ చెరువు ఉగ్రరూపం కూడా దాల్చుతుంది. గతంలో ఇదే గండి ప్రవాహంలో పడి లో ఓ బాలుడు కొట్టుకుపోయాడు.

ద్రాక్షారామలో హుస్సేన్ వాక్



ద్రాక్షారామలో హుస్సేన్ వాక్ నిర్వహిస్తున్న ముస్లిం భక్తులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ముస్లిం భక్తులు కర్బలా వీరులకు నివాళులు అర్పిస్తూ ఆదివారం హుస్సేన్ వాక్ నిర్వహించారు. ఇరాక్ దేశంలో నజఫ్ నుంచి కర్బలాకు నిర్వహించే హుస్సేన్ వాక్‌ను తలపించేలా ద్రాక్షారామ నుంచి హసన్‌బాదలోని ఇమామ్ హసన్ పంజా వరకూ వాక్ నిర్వహించారు. జాతీయ జెండాలు, ఇమామ్ హుస్సేన్ హజ్రత్ అబ్బాస్ జెండాలను చేతబూని చిన్నారులు, ముస్లిం భక్తులు లబ్బైక్ యా హుస్సేన్ అంటూ నినాదాలు చేస్తూ వాక్ చేశారు. దారి పొడవునా ప్రసాదాలు పంచి పెట్టారు. హసన్‌బాద ఇమామ్ హుస్సేన్ పంజాకు చేరుకుని కర్బలా వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు ఉంటుంది



శశికళను సత్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు, యానిమేటర్లు

రాయవరం: విధి నిర్వహణలో ఉద్యోగి అందించే ఉత్తమ సేవలకు గుర్తింపు ఉంటుందని రాయవరం యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజరు సత్యనారాయణ అన్నారు. రాయవరం యూనియన్ బ్యాంకులో మేనేరుగా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన శశికళను ఆదివారం బ్యాంకులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజరు సత్యనారాయణ మాట్లాడుతూ శశికళ అంకితభావంతో విధులు నిర్వర్తించి కస్టమర్ల ఆదరణ పొందారన్నారు. అనంతరం శశికళ, మూర్తి దంపతులను యూనియన్ బ్యాంకు చీఫ్ మేనేజరు సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయదుర్గా పీఠం ప్రతినిధులు బాబీ, గాదె కృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపేస్తే చర్యలు తప్పవు



ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

అయినవిల్లి: ప్రయాణికులు ఎక్కడానికి, దిగడానికి ఎక్కడ పడితే అక్కడ సడన్‌గా బ్రేక్ వేసి రోడ్లపై ఆటోలు ఆపితే చర్యలు తప్పవని ఆటో యూనియన్ నాయకులను సీఐ డి.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం అయినవిల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో యూనియన్ నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రోడ్లపై ఆటో ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు అందరికీ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్ వంటి పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మైనర్లకు ఆటోలు ఇవ్వడం, మద్యం తాగి ఆటోలు నడపడం వంటివి నేరమన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.మనోహర్ జోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొల్ల విగ్రహావిష్కరణకు తరలిరావాలి

అంబాజీపేట: విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణకు కోనసీమలోని కుమ్మరి, శాలివాహనులు తరలిరావాలని జిల్లా కుమ్మరి, శాలివాహన సంఘ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి పిలుపునిచ్చారు. అంబాజీపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటకలోని మైసూర్ ఎంపీ ఎదువీర కృష్ణ దత్త సమరాజు వడయార్ (మైసూర్ మహారాజ్) హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు తదిదరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అయినవిల్లి: ఆబోతు ఢీకొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేదునూరుకు చెందిన మేడిశెట్టి ముత్యాలరావు కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు గోకరకొండ సత్యనారాయణ, గంజి వీరన్నబాబు రూ.13,500 ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ముత్యాలరావు కుటుంబానికి అందజేశారు.

సనాతన ధర్మంపై విస్తృత ప్రచారం



హిందూ సమ్మేళన సభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి

మామిడికుదురు: మరుగునపడిన సనాతన ధర్మంపై విస్తృత ప్రచారం చేసి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపడుతున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం మామిడికుదురులో 60 వసంతాల హిందూ సమ్మేళన ఉత్సవం మండల శాఖ అధ్యక్షుడు కూనపరెడ్డి రాము అధ్యక్షతన జరిగింది. ప్రజల్లో దేశభక్తితో పాటు దైవభక్తిని పెంపొందించడం, అంటరానితనం నిర్మూలించడం, ధార్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వీహెచ్‌పీ ప్రధాన లక్ష్యాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా హోమియో వైద్య సేవలందిస్తున్న వలవల బాబ్జి, నయినాల అబద్ధం, బొక్కా సూర్యప్రకాశరావు, తుమ్మల పద్మాజీరావు, కంచర్ల గణపతిరావు, బత్తుల రమేష్ తదితరులను సత్కరించారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రతినిధులు పోలిశెట్టి ప్రసాద్, నూలు మురళీకృష్ణ, నూలు శ్యామల, సత్సంగ్ ప్రముఖ్ పాపాయిశర్మ, పెచ్చెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది' వాయిదా

కపిలేశ్వరపురం: ఈ నెల 3 నుంచి ప్రారంభించాల్సిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలను వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు మండల వ్యవసాయాధికారి కేఎన్‌వీ రమేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఈనెల 3న టేకి, వాకతిప్ప, 4న అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేశారు. ఈ నెల 10 నుంచి షెడ్యూల్‌లో నిర్దేశించిన గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించనున్నామన్నారు. నూతన ఆధునిక సాంకేతిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించనున్నారు. 10న నిడసనమెట్ట, వడ్లమూరు,11న నల్లూరు, కాలేరు, 17న నేలటూరు, వల్లూరు, 18న కోరుమిల్లి, మాచర, 24న కపిలేశ్వరపురం, తాతపూడి, 25న కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఏఓ తెలిపారు.

రేపు అంగరలో రక్తదాన శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు వాసవీ క్లబ్, వనితా క్లబ్, వీకేఎస్‌వీ, వారియర్స్ క్లబ్ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రటనలో తెలిపారు. గ్రామంలోని అశిరాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 9 నుంచి 2 గంటలు వరకూ శిబిరం నిర్వహించనున్నామన్నారు.

అమ్మవారికి వెండి మకర తోరణం అలంకరణ



అన్నాయిపేటలో ఎల్లారాంబికా అమ్మవారికి అలంకరించిన వెండి మకరతోరణం

రామచంద్రపురం రూరల్: మండలలోని అన్నాయిపేటలో వేంచేసిన ఎల్లారాంబికా అమ్మవారికి గ్రామస్తులు చేయించిన వెండి మకర తోరణాన్ని ఆదివారం అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రావణమాసం సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), ఆలయ కమిటీ సభ్యులు కాకిలేటి సత్యనారాయణ ఆనాల రాజబాబు, నున్న లక్ష్మీనారాయణ, కర్రి సూర్యనారాయణ, ఆకేటి హరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీట మునిగిన కాలనీలు



పాదలాడలో ముంపునకు గురైన కంచి కామాక్షమ్మ కాలనీ



కేశవదాసుపాలెం శివారు అగస్టీన్ కాలనీలో ఇళ్ల వద్దకు పోటెత్తిన ముంపు నీరు



మామిడికుదురులో రోడ్డుపై నిలిచిపోయిన ముంపు నీరు

రాజోలు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పలు కాలనీలు, పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలోని సోంపల్లి డ్రైన్, చింతలపల్లి డ్రైన్‌లు ముంపు నీటితో పోటెత్తాయి. పాదలాడ కంచికామాక్షమ్మ కాలనీ పూర్తిగా ముంపునకు గురైంది. ముంపునీరు దిగకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా మోకాలు లోతు నీటిలో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ముంపునీరు దిగేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజోలు మండలంలో చింతలపల్లి, పొన్నమండ, కూనవరం, శివకోడు, బి.సావరం, కడలి గ్రామాల్లోని కాలనీలను వర్షం నీరు ముంచెత్తింది.

నియోజకవర్గంలో సుమారు 4,400 ఎకరాల్లో వరినాట్లు ముంపునీటిలో ఉన్నాయి. ముంపునీరు కారణంగా వరినాట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజోలు మండలంలో సుమారు 114 ఎకరాల్లో వేసిన వరి నాట్లు ముంపునీటితో చెరువులను తలపిస్తున్నాయి.

వరి చేలల్లోని ముంపు నీరు దిగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపల్లి, శివకోడు ప్రాంతాల్లో రైతులు కొందరు ఇంజిన్ల సాయంతో ముంపు నీటిని డ్రైన్లలోకి తోడుకుంటున్నారు.

ముంపు బారిన పడిన అగస్టీన్ కాలనీ

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశవదాసుపాలెం శివారు అగస్టీన్ కాలనీ భారీ వర్షాలకు ఆదివారం ముంపు బారిన పడింది. ముంపు నీరు వెళ్లడానికి ఎటూ దారి లేకపోవడంతో ఇళ్లల్లోకి పోటెత్తింది. ఇళ్లల్లోని గదుల్లో సామాన్లు వర్షం నీటితో తడిసి మద్దయ్యాయని స్థానికులు వాపోతున్నారు. కాలనీ చుట్టూ రొయ్యల చెరువుల సాగు వల్ల కూడా ముంపు నీరు చుట్టుముట్టిందని కాలనీవాసులు చెబుతున్నారు. ముంపు నీటిని మళ్లించేందుకు అధికారులు తక్షణం డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వర్షం తగ్గినా వీడని ముంపు బెడద

మామిడికుదురు: భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినా గ్రామాల్లో ముంపు బెడద మాత్రం ప్రజలను వెన్నాడుతూనే ఉంది. వాయుగుండం కారణంగా రెండు రోజుల నుంచి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ముంపు నీరు భారీగా నిలిచిపోయింది. మామిడికుదురులో జాతీయ రహదారి నుంచి ముస్లిం వీధికి వెళ్లే రోడ్డుపై భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. నగరం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మామిడికుదురు, నగరం, పాశర్లపూడి గ్రామాల్లో సైతం జాతీయ రహదారిపై సైతం ముంపు నీరు నిలిచిపోయింది. కరవాక గ్రామంలో పంచాయతీ అధికారులు కచ్చా డ్రైన్లు తవ్వించి ముంపు నీటిని బయటకు మళ్లించారు. మొగలికుదురు, గెద్దాడ, మామిడికుదురు ఆల్‌క్యాస్ట్ కాలనీల్లోనూ ముంపు నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో 24 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

రామచంద్రపురం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. పట్టణంలోని గాంధీనగర్ పార్టీ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.